# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచం హరిత భవిష్యత్ దిశగా పురోగమిస్తోందని, ఈ పరివర్తనకు భారతదేశం కీలకంగా దోహదపడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- సంపూర్ణ అభివృద్ధిని సాధించాలంటే దేశ భద్రత అత్యంత ఆవశ్యకమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు.
- పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భారత్.. ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తోందని కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.
- మత్స్య, జల వనరుల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి నూతన ఆవిష్కరణలను స్వీకరించవలసి ఉందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూరత్‌లో ఈరోజు 18 వేల 800 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ... రహదారి, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన ఈ కార్యక్రమాలు అభివృద్ధిని వేగవంతం చేస్తాయని, ప్రజల జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయని అన్నారు. పర్యావరణ దినోత్సవం రోజున దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరాల్లో ఒకటైన సూరత్‌లో ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచం క్రమంగా హరిత భవిష్యత్ దిశగా పురోగమిస్తోందన్న ప్రధానమంత్రి.. ఈ పరివర్తనకు భారతదేశం చురుకుగా దోహదపడుతోందని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సంపూర్ణ అభివృద్ధిని సాధించాలంటే ముందుగా దేశాన్ని సురక్షితంగా, భద్రంగా ఉంచడం అత్యంత ఆవశ్యకమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. త్రిపురలోని భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న లంకమురా బోర్డర్ అవుట్‌పోస్ట్ వద్ద ఈరోజు జరిగిన `ప్రహరి సమ్మేళనం`లో ఆయన మాట్లాడుతూ.. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పని చేస్తున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, పశువుల స్మగ్లింగ్, మానవ అక్రమ రవాణా వంటి ముప్పులను పూర్తిగా నిర్మూలించాల్సి ఉందని స్పష్టం చేశారు. నకిలీ కరెన్సీ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించే అన్ని ప్రయత్నాలను అడ్డుకోవడం కూడా కీలకమని వ్యాఖ్యానించారు. సరిహద్దు స్మగ్లింగ్, చొరబాట్లను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్ట్‌ను ఖరారు చేస్తోందని అమిత్ షా వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వరుసగా రెండోసారి వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రెండవ ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని ఈరోజు ప్రకటిస్తూ, స్వల్పకాలిక రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను ఆర్‌బీఐ 6.9 శాతం నుండి 6.6 శాతానికి తగ్గించింది. అదే విధంగా సీపీఐ ద్రవ్యోల్బణ లక్ష్యాన్ని కూడా 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచింది. కాగా.. రెపో రేటును 5.25 శాతంగా యథాతథంగా ఉంచాలన్న ఆర్‌బిఐ నిర్ణయం.. వృద్ధిని, వ్యాపార సెంటిమెంట్లను బలోపేతం చేస్తుందని పారిశ్రామిక సంస్థ అసోచామ్ (ASSOCHAM) పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్తాన్ ఆక్రమిత భూభాగాల్లోని గిల్గిట్-బాల్టిస్తాన్ అసెంబ్లీకి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలన్న ఆ దేశ ప్రణాళికలపై భారత్ తీవ్ర నిరసన తెలిపింది. గిల్గిట్-బాల్టిస్తాన్ ప్రాంతంతో సహా జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలన్నీ భారతదేశంలో అంతర్భాగమని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది. పాకిస్తాన్ ఆక్రమించుకున్న భూభాగాల్లో నెలకొన్న మానవ హక్కుల ఉల్లంఘనలు, రాజకీయ అణచివేత, ఆర్థిక దోపిడీ వంటి సమస్యలను ఇటువంటి ప్రయత్నాల ద్వారా ఆ దేశం కప్పిపుచ్చలేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మత్స్య, జల వనరుల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి నూతన ఆవిష్కరణలను స్వీకరించవలసి ఉందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. విశాఖపట్నంలో ఈరోజు జరిగిన సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ జాతీయ సెమినార్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆక్వా రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విశ్వసనీయమైన సీఫుడ్ బ్రాండ్‌గా భారతదేశాన్ని నిలబెట్టాలని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణ పరిరక్షణ చర్యలలో భారత్.. ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన ఈరోజు ఢిల్లీ

ముఖ్యమంత్రి రేఖా గుప్తాతో కలిసి నగర వ్యాప్తంగా 18 'నమో ఆక్సిజన్ పార్కుల'ను ప్రారంభించారు. అలాగే.. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా పలు పర్యావరణ కార్యక్రమాలను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... వాతావరణ మార్పు, జీవవైవిధ్య నష్టం, భూక్షయం అనే మూడు ప్రధాన పర్యావరణ సవాళ్లను నేడు మానవాళి ఎదుర్కొంటోందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్.. సౌర విద్యుత్ సామర్థ్య పెంపులో ప్రపంచంలో అగ్రగామి దేశాలలో ఒకటిగా నిలవడం, పీఎం సూర్య ఘర్ యోజనను అమలు చేయడం, అంతర్జాతీయ సౌర కూటమిని స్థాపించడం వంటి మైలురాళ్లను సాధించిందని కేంద్రమంత్రి వివరించారు.

=======================

పర్యావరణ పరిరక్షణ పట్ల నిబద్ధతను మరింత బలోపేతం చేసుకోవాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపరాష్ట్రపతి సామాజిక మాధ్యమం పోస్ట్‌లో.. ప్రకృతితో సామరస్యంగా జీవించాలని మనదేశ నాగరికతా విజ్ఞానం బోధిస్తోందని పేర్కొన్నారు. వనరులను వివేకవంతంగా పంచుకోవాలని, సకల జీవులను రక్షించాలని తమిళ సాహిత్య గ్రంథం తిరుక్కురళ్ సూచిస్తోందని.. సుస్థిరత, అన్ని జీవరాశుల పట్ల కరుణ అనేవి ప్రాథమిక విధులని ఇది మనకు గుర్తు చేస్తుందని ఆయన అన్నారు.

=======================

కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్.. జమ్మూలోని కన్వెన్షన్ సెంటర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాంతీయ వాతావరణ కేంద్రం RMCని ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... ఈ కొత్త RMC.. జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్‌లకు వాతావరణ సూచన సేవలను బలోపేతం చేస్తుందన్నారు. వాతావరణ అంచనా, పర్యవేక్షణ, విపత్తుల సంసిద్ధతను మెరుగుపరిచేలా ఈ కేంద్రం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు.

=======================

ఉత్తర ప్రదేశ్‌లోని బల్లియాలోని జయప్రకాష్ నారాయణ్ పక్షి సంరక్షణ కేంద్రం (సుర్హా తాల్)ను దేశపు 100వ రామ్సర్ సైట్‌గా ప్రకటించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సహజ పరిసరాలను, ప్రత్యేకించి చిత్తడి నేలలను పరిరక్షించడంలో భారతదేశ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని స్పష్టం చేశారు. ఈ చిత్తడి నేల.. వైవిధ్యభరితమైన పక్షి జాతులతో సమృద్ధిగా ఉంటూ అనేక వలస పక్షులకు, స్థానిక పక్షులకు నెలవుగా నిలుస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాల ద్వారా చిత్తడి నేలల పరిరక్షణ, పునరుజ్జీవన ప్రయత్నాలు దేశంలో గణనీయంగా పెరిగాయన్నారు. జీవవైవిధ్యాన్ని పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు రానున్నతరాలకు పచ్చని భవిష్యత్‌ను అందించడంలో ఈ ప్రయత్నాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రధానమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

=======================
=======================